
# అమ్మతనాన్ని ఆస్వాదిస్తూ..



'పెద్దలు కూడా చిన్నపిల్లల్లా తింటే!?' అనే శీర్షికతో దీపిక చేసిన పోస్ట్.. నవ్వు తెప్పిస్తున్నది. సోఫాలో పడుకున్న ఒక మహిళ నిద్రలేచి.. భోజనం చేయడానికి వంటగదికి వెళ్లడం.. ప్లేట్ వైపు చూస్తూ, డైనింగ్ టేబుల్ వద్ద గజిబిజిగా తినడానికి ప్రయత్నించడం ఈ వీడియోలో కనిపిస్తుంది. సదరు మహిళ చిన్నపిల్లలా నోరు తెరిచి, తలను ఆడిస్తూ.. చేతిలోని సాండ్‌విచ్‌ను ఒక్కసారి కొరికి వెంటనే నిద్రలోకి జారుకోవడం కాస్త ఫన్నీగా ఉంది. బాలీవుడ్ బ్యూటిఫుల్ కపుల్ దీపిక పదుకొణె – రణవీర్ సింగ్.. ఇటీవల పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చారు. సోషల్‌మీడియా వేదికగా తమ సంతోషాన్ని అభిమానులతో పంచుకున్నారు. అప్పటినుంచి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకపోయినా.. దీపిక మాత్రం తన ఇన్‌స్టా బయోను 'ఫీడ్ బర్ప్ స్లీప్ రిపీట్'గా మార్చుకున్నది. అయితే, ప్రస్తుతం సినీ సెలెబ్రిటీల ఇండ్లలో 'నానీ'ల సంస్కృతే నడుస్తున్నది. తమ పిల్లల సంరక్షణ కోసం 'ఖరీదైన నానీ'లను నియమించుకోవడం ఇప్పుడు స్టేటస్ సింబల్‌గానూ మారింది. అయితే, దీపిక మాత్రం తన బిడ్డ కోసం 'నానీ'ని నియమించడం లేదని బీటౌన్‌లో టాక్. తన గారాలపట్టికి కావాల్సిన అన్ని సేవలనూ తానే స్వయంగా అందిస్తుందట. ఈ విషయంలో మరో అందాలతార ఐశ్వర్య రాయ్ బచ్చన్‌ను ఆదర్శంగా తీసుకున్నదట దీపిక.

సృష్టిలో అందరికన్నా గొప్పది 'అమ్మ'! సాధారణ మహిళలు మొదలుకొని.. సెలెబ్రిటీల వరకూ అమ్మతనాన్ని వరంగా భావించే వాళ్లే! ప్రస్తుతం బాలీవుడ్ బ్యూటీ దీపిక పదుకొణె కూడా.. మాతృత్వపు మధురిమల్లో మునిగితేలుతున్నది. ఈ నెల 8న పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన దీపికా.. తాజాగా, పిల్లల ఆహారపు అలవాట్లపై ఓ ఫన్నీ వీడియోను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకున్నది.

# జిందగీ



# కలర్ కాదన్నయ్యా.. కటౌట్ చూడు!

**హీరో అంటే..**
**ఒడ్డూపొడుగూ ఉండాలి.**
**ముక్కూమొహం బాగుండాలి.**
**నిమ్మపండు మేనిఛాయ మస్ట్.**

**పొడగరి కాకపోయినా, విశాల నేత్రాలు లేకపోయినా.. రంగుంటే చాలు! ఇదీ హీరోల ఎంపికలో సినీజనాల ఈక్వేషన్! కాస్త రంగు తక్కువ ఉన్నోళ్లు.. అవకాశాల కోసం సినిమా ఆఫీసుల తలుపు తడితే.. 'ముఖం ఎప్పుడైనా అద్దంలో చూసుకున్నావా?' డైలాగ్ పరిపాటి. కానీ, ఫెయిర్ కలర్ ఫార్ములా వర్కవుట్ కావడంలేదు. రంగు లేకున్నా.. టాలెంట్ ఉంటే చాలంటున్నారు. కలర్ తక్కువున్నా కాలర్ ఎగరేసుకొని.. సక్సెస్ సాధిస్తున్న నటులు ఎందరో ఉన్నారు.**

యస్.. మడిషన్నాక కాసింత కళాపోషణ ఉండాలి.. లేపోతే.. మనిషికీ గొడ్డుకూ తేడా ఏటుంటాదీ! ఈ డైలాగ్ దశాబ్దాల కాలం ముందు రాసిందే. కానీ, ఇప్పుడు ఇదో ట్రెండింగ్ ఫార్ములాగా నేటి మన తెలుగు సినీ రంగానికి అన్వయించుకోవచ్చు. తమిళనాడులో తలైవా రజనీ ఈ ఫార్ములా ఎప్పుడో ప్రూవ్ చేసి చూపించాడు. తర్వాత ధనుష్ గురించి అయితే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నేటి జనరేషన్‌కి ఓ ప్రేరణ. వీరితోపాటు కోలీవుడ్‌లో మరెందరో మాణిక్ బాషాని ఫాలో అయ్యారు. మంచి మాస్ ఫాలోయింగ్‌తో స్టార్‌లుగా ఎదిగారు. ఇప్పుడీ ట్రెండ్ మన టాలీవుడ్‌లోనూ పీక్స్‌కి చేరింది. ఎందుకంటే.. మన కథల్లో ఇప్పుడిప్పుడే రజనీలా నల్ల బంగారాలు మెరుస్తున్నారు. హీరో పక్కన ఫ్రెండ్ క్యారెక్టర్ గానో... మెయిన్ విలన్ పక్కన కామెడీ విలన్ గానో.. పక్కింటి అంకుల్‌ని ఏడిపించే జులాయిగానో.. అయితే పెద్ద విశేషం ఏం ఉంటుంది. హీరోలుగానే మెప్పిస్తున్నారు. హీరోయిన్‌తో డ్యూయెట్ పాడుతున్నారు. అంతేకాదు.. ఈ కుర్రోడు హీరో ఏంట్రా అని మాట్లాడే వాళ్లకి స్ట్రాంగ్ గానే సమాధానాలు ఇస్తున్నాడు. ఇంకొందరు.. సోషల్ మీడియా స్టార్‌లుగా ఎదుగుతున్నారు. వెబ్ సిరీస్‌లు చేస్తూ మిలియన్ల వ్యూస్‌తో ఫ్యాన్ బేస్ పెంచుకుంటున్నారు. ఒకరిని హీరోని చేసేవి ఒడ్డు, పొడుగు, రంగు, రూపం కాదు.. హార్డ్‌వర్క్, సిన్సియారిటీ, టాలెంట్, డిసిప్లిన్ మాత్రమే అని నిరూపిస్తున్నారు.



## సునీల్ నుంచి సత్య వరకు..

కామెడీ టైమింగ్ అంటే సునీలే. సౌండ్ చేసినా, చిత్రమైన ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినా.. నవ్వులే నవ్వులు. హీరో దోస్తుగా పంచ్‌లు వేసిందీ, మర్యాదరామన్నలా ఫ్యామిలీ ఆడియన్స్‌ని మెప్పించిందీ.. సిక్స్ ప్యాక్స్‌తో ఔరా అనిపించుకుందీ, పుష్పలో ఫైర్ అయిందీ సునీల్ వర్మే. ఇంత నల్లగా ఉన్నాడు.. ఇతణ్ని ఎవరు చూస్తారని అవమానించిన తెలుగు సినీ పరిశ్రమలోనే చెరగని ముద్ర వేశాడు. ఇక ఇప్పుడు అదే బాటలో హీరోగా ఎదుగుతున్నాడు సత్య. జూనియర్ సునీల్ అనిపించుకున్నాడో లేదో.. నాన్‌స్టాప్‌గా సినిమా ఆఫర్లు పట్టేస్తున్నాడు. హీరోకి సమానంగా సీన్లు. ఈ బ్లాక్ హార్స్ టైమింగ్‌ని అందుకోవడానికి హీరోలే కష్టపడే పరిస్థితి. అందుకు సాక్ష్యమే 'రంగబలి'. దీంట్లో హీరో నాగశౌర్యతో కలిసి కామెడీ పండించిన విధానం చూస్తే సత్య టైమింగ్ స్టామినా అర్థం అవుతుంది. టీవీ కామెడీషోతో మొదలైన సత్య జర్నీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా.. ఆ తర్వాత కమెడియన్‌గా.. ఇప్పుడు హీరోగా కొనసాగుతున్నది. థియేటర్లలో సందడి చేస్తున్న 'మత్తు వదలరా2'లో తన విశ్వరూపం చూపించాడు. అందంతోనో.. ఆహార్యంతోనో కాదు.. తన హావభావాలతో ప్రేక్షకులకు 'చిల్'పిల్ వేశాడు. పంచ్‌లోనే కాకుండా.. తన డ్యాన్స్ మూమెంట్.. ఫైట్లు.. సినిమాకి లైఫ్‌గా మార్చేశాడు. ఇంతకంటే ఏం కావాలి.. ఓ నటుణ్ని నియంత్రించేది రంగు కాదని చెప్పడానికి!

## హీరో ఫ్రెండు కాదిప్పుడు

అతణ్ని చూస్తే మన పక్కవీధిలో కుర్రాడిలా కనిపిస్తాడు. అతనే సుహాస్. యూట్యూబ్‌తో కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత సిల్వర్ స్క్రీన్ నటుడిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నాడు. హీరోకి ఫ్రెండుగా.. వీడు మన దోస్తులానే ఉన్నాడే అనిపించుకున్నాడు. పెద్ద ఆలస్యం చేయకుండానే ఓ వైపు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తూనే మరోవైపు హీరోగా నటించి విజయాలను అందుకున్నాడు. అతని నేచురల్ నటనకు ఆడియెన్స్ బాగా కనెక్ట్ అవుతున్నారు. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు', 'జనక అయితే కనక' చిత్రాలతో ప్రేక్షకుల మదిని దోచేశాడు. ఇప్పుడు గొర్రెని హీరోగా చేసి భిన్నమైన పాత్రతో థియేటర్లలో సందడి చేస్తున్నాడు. అయినా.. దేవుడిచ్చిన రంగుపై సుహాస్‌కు కామెంట్స్ తప్పలేదు. కానీ.. తనకి తెలిసింది నటించడం. 'కలర్ ఫొటో'తో హీరోగా మారిన సుహాస్ ఇప్పుడు చిన్నసినిమాల బాక్సాఫీస్ ఈక్వేషన్స్‌ను సరిచేసే స్థాయికి ఎదిగాడు.

## అప్పట్లో 'ప్రియదర్శి'కీ తప్పలేదు

'నా చావు నేను చస్తా' అనే ఒక్క డైలాగ్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రియదర్శి. వరుస విజయాలు వరిస్తున్నా.. తన నటనకు రంగు అవరోధంగా మారిందని పలు సందర్భాల్లో చెప్పాడు. మొదట్లో ఇలాంటి అవమానాలెన్నో అనుభవించానని తెలిపాడు. 'ఆడిషన్స్‌కు వెళ్లినప్పుడు నల్లగా, సన్నగా ఉన్నాడు, మొటిమలు ఎక్కువ ఉన్నాయి. హీరో కంటే పొడుగ్గా ఉన్నాడు అనే వాళ్లు. అలా అన్నప్పుడల్లా నన్ను నేను ప్రోత్సహించుకునే వాడిని...' అని ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నాడు దర్శి. పెద్ద హీరోలతోనూ కలిసి నవ్వుల్ని పంచుతూ.. ఆరోగ్యకరమైన కామెడీని ఇస్తూ అందరి మనసులో మంచి స్థానాన్ని సంపాదించుకున్నాడు. 'మల్లేశం' సినిమాలో తన అభినయంతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఇక బలగం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. షార్ట్ ఫిల్మ్‌లతో మొదలైన తన కెరీర్.. ఇప్పుడు జోష్‌ఫుల్‌గా సాగుతున్నది.

## సుమ కొడుకుకీ తప్పలేదు!!

'కర్రెగా ఉన్నాడా? తెల్లగా ఉన్నాడా' అనేది మ్యాటర్ కాదు. ఇక్కడ టాలెంట్ ముఖ్యం. 'అరే వీడు హీరోనా? వీడేంటి మస్త్ కర్రెగా ఉన్నాడు? హీరో ముఖం కాదు.. వేస్ట్ మెటీరియల్' అని చాలా అన్నారు. నేను ఇలానే పుట్టాను. ఇలానే ఉంటా. ఒక మనిషి సక్సెస్ డిసైడ్ చేసేది నలుపు, తెలుపు, అందం కాదు బ్రదర్. ఆ మనిషి హార్డ్‌వర్క్, టాలెంట్. వాటినే ఇండస్ట్రీ నమ్మేది' ఈ మాటలు అన్నది ఎవరో కాదు. ప్రముఖ యాంకర్ సుమ కనకాల కొడుకు రోషన్. తనపై వచ్చిన కామెంట్స్‌కి చాలా బోల్డుగా స్పందించాడు. 'బబుల్ గమ్' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోషన్ యాక్టర్‌గా మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు. తన రెండో సినిమా 'మోగ్లీ'తో ముందుకు వచ్చేస్తున్నాడు. ఎంత పెద్ద సెలెబ్రిటీల పిల్లలకైనా రంగు దెబ్బ తప్పడం లేదు. రోషన్ చెప్పినట్టు టాలెంట్ ఒక్కటే కొలమానం అని అంగీకరించకతప్పదు.

**తమిళ్ హీరోలే ప్రేరణ!!**

విజయ్ సేతుపతి సౌత్ ఇండియా విలక్షణ నటులలో ఒకరు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి సక్సెస్ అయ్యాడు. హీరో అంటే ఇలానే ఉండాలి అనే బౌండరీలు చెరిపేసి.. ఎవరైనా హీరో కావచ్చని రుజువు చేశాడు. విశాల్ సంగతి సరేసరి! కలర్ తక్కువున్నా.. మనోడి కటౌట్ పెద్దదే!! తమిళ సినిమాల్లో కమెడియన్ యోగిబాబు ఇంకా అదుర్స్. రోజుకి రెండు వేలు రెమ్యునరేషన్ తీసుకున్న యోగి కాల్షీట్ కాస్టు ఇప్పుడు రూ.10 లక్షల పైమాటే. ఈ స్టార్ కమెడియన్ సోలో హీరోగా కూడా సినిమాలు చేస్తున్నాడు. యోగిబాబు సినిమాల్లోకి వచ్చి ఎంతో కాలం కాలేదు. ఒకప్పుడు అతని లుక్ చూసి చాలామంది నవ్వేవారట. 'నీ అవతారం అంటూ.. బాడీ షేమింగ్ చేశారు. అయితే దీని గురించి పెద్దగా ఆలోచించలేదు. కామెడీకి బాడీ లాంగ్వేజ్ చాలా ముఖ్యం. నేను దాన్ని వాడుకున్నాను. అంతేకాదు.. నన్ను ప్రోత్సహించిన వారూ ఉన్నారు' అని యోగిబాబు ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. అన్నట్టూ.. ఇంకో విషయం, ప్రభాస్ 'రాజాసాబ్' సినిమాతో యోగిబాబు టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఇలా చెబుతూపోతే తమిళంలో నల్ల బంగారాల లిస్ట్ పెద్దదే!!

... రాజేశ్ యడ్ల

# సెలెబ్రిటీలు చేస్తే సెన్సేషనే!

తల్లిదండ్రులు ఎక్కడికి వెళ్లినా పిల్లల్ని వెంటతీసుకెళ్లడం మామూలే! అయితే, ఇదంతా సామాన్యుల విషయంలోనే! సెలెబ్రిటీల దగ్గరికి వచ్చేసరికి మాత్రం.. అది ఓ సెన్సేషన్ అవుతుంది. తాజాగా, అందాల తార ఐశ్వర్యరాయ్, ఆమె కూతురు ఆరాధ్యను పలు వేడుకలకు తీసుకెళ్లడం.. సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అబుదాబి వేదికగా ఇటీవల జరిగిన ఐఫా–2024 వేడుకలకు ఐశ్వర్య తన కూతురు ఆరాధ్యను వెంట తీసుకెళ్లింది. రెడ్ కార్పెట్‌పై కూతురితో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చింది. ఈ సందర్భంగా ఓ విలేకరి 'మీ కూతురు ఆరాధ్య మీవెంటే ఉంటూ ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నది..' అని ఇంకా ఏదో అడగబోతుండగా.. ఐశ్వర్య అసహనం వ్యక్తం చేసింది. 'తను నా కూతురు. ఎప్పుడూ నాతోనే ఉంటుంది!' అంటూ అక్కణ్నుంచి వెళ్లిపోయింది. అయితే.. ఐశ్వర్య చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కొందరు నెటిజన్లు వీటిని నెగెటివ్‌గా తీసుకుంటున్నారు. అభిషేక్‌తో ఆమె విడాకులు తీసుకోబోతున్నదనీ.. అందుకే, తన బిడ్డ ఎప్పుడూ తనతోనే ఉంటుందని చెప్పుకొచ్చిందంటూ తెగ ట్వీటుతున్నారు. బచ్చన్ అభిమానులు మాత్రం.. ఆ పోస్టులను పట్టించుకోవాల్సిన అవసరం లేదంటున్నారు. ఇటీవల పారిస్‌లో జరిగిన ఓ ఫ్యాషన్ వేడుకకు సైతం ఐశ్వర్య తన కూతురిని వెంట తీసుకెళ్లిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. దాదాపు నాలుగేండ్ల తర్వాత 'పొన్నియన్ సెల్వన్'తో తెరపై మెరిసింది ఈ అందాల తార. కీలక పాత్రలో నటించి.. అభిమానులను అలరించింది. పార్ట్–2లో అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చి.. ఉత్తమ నటిగా 2024 ఐఫా అవార్డును అందుకున్నది. కాగా, ప్రేమించి పెళ్లి చేసుకున్న ఐశ్వర్య రాయ్–అభిషేక్ బచ్చన్.. విడాకులు తీసుకోబోతున్నారంటూ కొద్దికాలంగా బీటౌన్‌లో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ వార్తలపై బచ్చన్ దంపతులు అధికారికంగా స్పందించకపోవడం, తన కూతురు తనతోనే ఉంటుందని ఐశ్వర్య కామెంట్స్ చేయడం బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



# యానిమల్ మాత్రమే కాదు..



తొలి చిత్రంతోనే తెలుగువారికి చేరువైంది మృణాల్ ఠాకూర్! 'సీతారామం'తో వెండితెరపై మెరిసి.. 'సీత'గా అభిమానుల గుండెల్లో చెరగని ముద్రవేసింది. అందంతోపాటు అద్భుతమైన నటనతో కట్టిపడేసే ఈ మరాఠీ ముద్దుగుమ్మ.. తక్కువ సమయంలోనే ఎక్కువ క్రేజ్‌ను సంపాదించుకున్నది. తాజాగా అబుదాబీలో జరిగిన ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్ (ఐఫా) ఉత్సవ్‌లో పాల్గొన్నది. ఈ సందర్భంగా బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ గురించి మృణాల్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఇంతకూ మృణాల్ ఏమన్నదంటే.. 'అందరూ యానిమల్ సినిమాలో రణ్‌బీర్ పాత్ర గురించే మాట్లాడుతున్నారు. ఆ పాత్ర ఎంతో క్రూరంగా ఉన్నదని విమర్శిస్తున్నారు. అయితే, 2012లో ఇదే రణ్‌బీర్ 'బర్ఫీ'లో చెవిటి–మూగ వ్యక్తిగా నటించిన విషయాన్ని ఎవరూ మర్చిపోవద్దు. అప్పుడు అమాయకుడిగా.. ఇప్పుడు యానిమల్‌గా రెండు విభిన్న పాత్రలను అద్భుతంగా పండించాడు రణ్‌బీర్..' అంటూ కపూర్‌ల వారసుణ్ని ఆకాశానికి ఎత్తేసింది. బర్ఫీ, యానిమల్ చిత్రాల్లో అద్భుతమైన నటనా కౌశలాన్ని పండించిన రణ్‌బీర్.. రెండు చిత్రాలకూ ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకోవడం విశేషం!

# మోక్షం దొరికేనా!?

**ద మిస్టరీ ఆఫ్ మోక్ష ఐలాండ్**
**డిస్నీ+ హాట్ స్టార్ :** సెప్టెంబర్ 20
**తారాగణం:** ఆశుతోష్ రాణా, భాను చందర్, నందు, తేజస్వి తదితరులు
**దర్శకత్వం :** అనీశ్ కురువిల్లా

టాలీవుడ్ హిస్టరీ తెరిస్తే.. మిస్టరీ సినిమాలు చాలానే కనిపిస్తాయి. అప్పుడెప్పుడో వచ్చిన 'అవే కళ్లు'తో మొదలుపెడితే.. ఈ లిస్ట్‌కు ఎక్కిన 'హిట్' చిత్రాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని ఫట్ మనిపించినా.. సగటు ప్రేక్షకుడికి థ్రిల్‌ను మాత్రం పంచాయి. అందుకే, 'థ్రిల్లర్ జానర్' అంటేనే.. 'ఎవర్‌గ్రీన్' అన్నట్టుగా మారింది. ప్రస్తుతం 'డిస్నీ+ హాట్ స్టార్' వేదికగా వచ్చిన 'ద మిస్టరీ ఆఫ్ మోక్ష ఐలాండ్' కూడా అదేబాటలో నడుస్తున్నది. ఎనిమిది ఎపిసోడ్స్‌తో ఈనెల 20న విడుదలై.. రికార్డ్ స్ట్రీమింగ్ సొంతం చేసుకుంటున్నది. కథలోకి వెళ్తే.. విశ్వక్‌సేన్ (ఆశుతోష్ రాణా) ఓ శాస్త్రవేత్త. జనజీవనానికి దూరంగా 'మోక్ష ఐలాండ్'లో ఉంటూ.. పరిశోధనలు చేస్తుంటాడు. రూ. 24వేల కోట్ల ఆస్తిని కూడబెట్టి చనిపోతాడు. తాము విశ్వక్‌సేన్ వారసులమని ఉత్తరాల ద్వారా తెలుసుకున్న కొందరు.. మోక్ష ఐలాండ్‌కు చేరుకుంటారు. వారిలో ఒకరితో ఒకరికి ఎలాంటి సంబంధమూ ఉండదు. అయితే, ఎవరైతే ఆ ఐలాండ్‌లో వారం రోజులు గడుపుతారో.. వారికే తన ఆస్తిని ఇవ్వాలని విశ్వక్‌సేన్ తన వీలునామాలో రాస్తాడు. కానీ, ఐలాండ్ వచ్చినవారిలో ఒక్కొక్కరూ మాయమవుతూ.. ఆ చుట్టుపక్కల శవాలుగా కనిపిస్తుంటారు. ఆ మిస్టరీ హత్యలను చూసి.. మిగిలిన వాళ్లంతా భయపడిపోతారు. అయినా.. ఆస్తి కోసం అక్కడే ఉంటారు. ఇంతకూ ఆ హత్యలు చేస్తున్నది ఎవరు? అందరూ విశ్వక్‌సేన్ వారసులే అయితే, ఒకరి గురించి మరొకరికి ఎందుకు తెలియదు? చివరికి ఆ ద్వీపం నుంచి ఎవరైనా ప్రాణాలతో బయటపడ్డారా? అనేది మిగతా కథ. దర్శకుడు ఓ ఆసక్తికరమైన సబ్జెక్ట్‌ను ఎంచుకొని, అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఎంతో స్టడీ చేసి.. మిస్టరీని పకడ్బందీగా మలిచాడు. సిరీస్ మొదటి ఎపిసోడ్ నుంచే ప్రేక్షకులను కథలో లీనం చేస్తుంది. ల్యాగ్‌లు, డ్రామాలు లేకుండా సాగుతూ.. ప్రతి ఒక్కరికీ థ్రిల్‌ను పంచుతుంది.

